ప్రజాశక్తి
శనివారం 2 ఆగస్టు 2025 విజయనగరం

నేడు జిల్లా వ్యాప్తంగా అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్

ప్రజాశక్తి-విజయనగరంకోట

రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం కానున్న అన్నదాత సుఖీభవ కార్యక్రమం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకాశం జిల్లాలో ప్రారంభం చేయనున్నారని, అదే సమయంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రారంభం అవుతుందని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో 2,19,503 మంది రైతు కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని అన్నారు. మొత్తం 152.45 కోట్లు రూపాయిలు రైతుల ఖాతాల్లో జమ కానున్నాయని తెలిపారు. జిల్లాలో జరిగే సమావేశాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, శాఖల అధికారులు, రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు భాగస్వాములవుతారని తెలిపారు. విజయనగరం నియోజకవర్గం చెల్లూరు, గజపతినగరం -అగ్రికల్చర్ మార్కెట్ యార్డ్ , బొబ్బిలి- ఎంపిడిఒ కార్యాలయం దగ్గర, చీపురుపల్లి-డికె పాలవలస, కొత్తవలస ఎంపిడిఒ కార్యాలయం వద్ద, నెల్లిమర్ల-ఎంపిడి డెంకాడ వద్ద, రాజాం-ఎస్ ఆర్ కల్యాణమండపం వద్ద అన్నదాత సుఖీభవ ప్రారంభత్సవ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

వాస్తవాలకు ప్రతిబింబం ప్రజాశక్తి

- వార్షికోత్సవ సభలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కలెక్టర్ అంబేద్కర్
- ఘనంగా 45వ వార్షికోత్సవం.. ప్రత్యేక సంచిక ఆవిష్కరణ
- రక్తదానానికి విశేష స్పందన

'ప్రజాశక్తి' వార్షికోత్సవ ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్, అతిథులు; వార్షికోత్సవ సభలో మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వాస్తవాలకు ప్రతిబింబంగా నిలుస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి మార్గం చూపుతూ 45 ఏళ్లగా ప్రజాశక్తి ముందుకు సాగడం అభినందనీయమనిరాష్ట్ర చిన్న మధ్య తరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ అన్నారు. ప్రజాశక్తి 45వ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక జెడ్‌పి సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సభలో ముఖ్యఅతిథులుగా మంత్రి శ్రీనివాస్, కలెక్టర్ బిఆర్ అంబేద్కర్, డిఐపిఆర్ఒ ఎం.మల్లేశ్వరరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ పాల్గొన్నారు. ముందుగా ప్రజాశక్తి వ్యవస్థాపకులు మోటూరు హనుమంతురావు, కొరటాల సత్యన్నారాయణ చిత్రపటాలకు మంత్రి శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రజాశక్తి స్టాఫ్ రిపోర్టర్ కె.రమేష్ నాయుడు అధ్యక్షతన జరిగిన సభలో అతిథులంతా కలిసి ప్రజాశక్తి వార్షికోత్సవ ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. అనంతరం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజంలో వాస్తవాలను వెలుగులోకి తెచ్చే పత్రిక ప్రజాశక్తి అని, అందుకే ఆ పత్రికను ప్రజలంతా ఆదరిస్తారని అన్నారు. 45 ఏళ్లుగా ప్రజా సమస్యలపై వార్తలు రాస్తూ సమాజ అభివృద్ధిలో భాగస్వాములుగా ఉండటం అభినందనీయమన్నారు. ప్రజాప్రతినిధిగా అభివృద్ధి, సంక్షేమం వైపు దృష్టి సారిస్తున్నప్పుడు తమ దృష్టికి వాస్తవాలను వెలుగులోకి తీసుకొచ్చిన పత్రిక ప్రజాశక్తి అన్నారు. జిల్లాలో ప్రజాశక్తిలో వస్తున్న కథనాలను, వార్తలను ప్రజలు అభినందిస్తున్నారన్నారు. ఈ పత్రిక సిబ్బంది అంకిత భావం, స్ఫూర్తితో పనిచేయడం గొప్ప విషయమన్నారు. ప్రజాప్రతినిధులకు వాస్తవ విషయాలను తెలియజేసినపుడే వాటిని పరిష్కారం చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. మరిన్ని వాస్తవాలు, ప్రజా సమస్యలను కథనాలు ద్వారా తెలియజేయాలని కోరారు. కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో విలువలకు కట్టుబడి 45 ఏళ్లుగా ప్రయాణించడం చిన్న విషయం కాదన్నారు. ప్రజా సమస్యలను వెలికితీస్తూ వాటి పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకొస్తూ ప్రజాశక్తి ముందుకు సాగుతోందన్నారు. ఇదే స్ఫూర్తితో కొనసాగాలని ఆకాంక్షించారు. సమాచార శాఖ పౌర సంబంధాలశాఖ అధికారి ఎం.మల్లేశ్వరరావు మాట్లాడుతూ ప్రజాసమస్యలపై నికార్సుగా వార్తలు రాస్తూ బడుగు బలహీన వర్గాల వేదికగా ప్రజాశక్తి ఉందన్నారు. ప్రజాశక్తి ద్వారా ప్రజల సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు తెలుసుకునే అవకాశం కలుగుతుందన్నారు. మారుతున్న కాలానుగుణంగా మొబైల్ యాప్ ద్వారా కూడా వార్తలు వచ్చే విధంగా కృషి చేయాలని కోరారు.

డిపిఆర్ఒ మల్లేశ్వరరావు

సిఐటియు నేత సూర్యనారాయణ

ప్రజాశక్తి జిఎం వెంకటేశ్వరరావు

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రజాశక్తి ప్రతి అక్షరం ప్రజలు పక్షం అనే లక్ష్యంతో పని చేస్తుందన్నారు. అనేక ఇబ్బందులను ఎదుర్కొని కష్టజీవుల పత్రికగా ఉన్న ఏకైక పత్రిక అని కొనియాడారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు ప్రజలకు ఏ విధంగా ఉపయోగపడుతున్నాయి, వాటి వల్ల కలిగే నష్టాలు, ప్రయోజనాలను ప్రజాశక్తి వివరిస్తుందన్నారు. కార్మిక, పేద వర్గాల కోసం, దోపిడీలేని సమాజం కోసం పని చేస్తున్న కష్టజీవుల పత్రిక అని అన్నారు. నిజం తెలుసుకోవాలంటే ప్రజాశక్తి ద్వారానే సాధ్యమవుతుందన్నారు. అలాంటి పత్రిక అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు.

ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరావు మాట్లాడుతూ ప్రజాశక్తి అంటే వ్యాపారం కోసం కాదని, సేవా భావంతో పని చేస్తున్నది అనడానికి నేడు నిర్వహించిన రక్త దాన శిబిరమే ఉదాహరణ అని అన్నారు. కుటుంబ పెద్ద 45 ఏళ్లలో ఎటువంటి బాధ్యత మోస్తారో అదే విధంగా ప్రజాశక్తి జిల్లా, రాష్ట్రం, దేశం బాగుండాలని, దేశ సంపద కొద్ది మంది చేతుల్లో కాకుండా ఉండాలని కోరుకుంటున్న పత్రిక అన్నారు. సామాజిక లక్ష్యంతో పని చేస్తుందని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు, కోవిడ్‌లాంటి పరిణామాలు సంభవించినప్పుడు బాధితులకు సాయమందించడం లోను, వారిని ఆదుకోవడంలోను ప్రజాశక్తి ముందుంటుందని వివరించారు. ప్రజాశక్తిని ఇంతగా ఆదరించి ఈ స్థాయిలోకి రావడానికి సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. పోటీ ప్రపంచంలో నిలబడటం చాలా కష్టమని, నీతికి, నిజాయితీగా పని చేసే విలేకర్లు ఉండటం వల్లే ఈ స్థాయిలో పత్రిక ఉందని తెలిపారు. సభ ప్రారంభంలో జిల్లా మేనేజర్ సిహెచ్ రాము ప్రజాశక్తి ప్రస్థానం గురించి వివరించారు.

ప్రజాశక్తి పెంపుదలలోనూ, పత్రికను నడపడలోనూ కృషి చేస్తున్న ఏజెంట్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గాడి అప్పారావును అతిథుల చేతుల మీదుగా సత్కరించారు. సభలో వివిధ సంఘాల నాయకులు, ఉద్యోగులు, విద్యార్థులు, మహిళలు, ప్రజాశక్తి విలేకర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి జిల్లా మేనేజర్ రాము

రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన రెడ్ క్రాస్ చైర్మన్ ప్రసాద్

ప్రజాశక్తి దినపత్రిక 45వ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక జెడ్‌పి మినిస్టీరియల్ భవనంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని రెడ్ క్రాస్ చైర్మన్ కెఆర్‌డి ప్రసాద్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కెఆర్‌డి ప్రసాద్ మాట్లాడుతూ ప్రజాశక్తి సామాజిక దృక్పథం కలిగిన పత్రిక అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం వార్తల రూపంలో కృషి చేస్తూనే ఇటువంటి సామాజిక కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. ప్రతి ఏటా వివిధ రూపాల్లో సామాజిక కార్యక్రమాలు నిర్వహించి ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు. ప్రజాశక్తి వార్షికోత్సవం సందర్భంగా ఉద్యోగులు,పాఠకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు, యువత స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అనంతరం రక్తదానం చేసిన వారికి కలెక్టర్ అంబేద్కర్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు.

రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ కెఆర్‌డి ప్రసాద్

ద్వారపూడిలో పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరంకోట

విజయనగరం మండలం ద్వారపూడిలో కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ శుక్రవారం పింఛన్లు పంపిణీ చేశారు. లబ్ధిదారులతో మాట్లాడారు. మొదటిసారి పింఛను అందుకుంటున్న వితంతు మహిళలు ఆనందాన్ని వ్యక్తం చేసారు. ద్వారాపూడిలో మొత్తం 412 మంది పింఛనుదార్లు ఉండగా 142 మంది వితంతు పింఛన్లు అందుకుంటున్నారు. గ్రామం లో కొత్తగా 10 మంది వితంతువులకు పింఛను మంజూరైంది.

పింఛను నగదు అందజేస్తున్న కలెక్టర్ అంబేద్కర్

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్

ద్వారపూడిలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. సంపద ఎలా తయారవుతున్నదీ పరిశీలించారు. వేస్ట్ నుండి తయారైన ఎరువును పరిశీలించారు. నర్సరీలను పెంచే వారితో మాట్లాడుకుని వారికి విక్రయించడం ద్వారా ఆదాయాన్ని పొందవచ్చునని తెలిపారు. సంపద తయారీపై శనివారం జిల్లాలోనున్న ఎంపిడిఒలకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని ద్వారపూడి కేంద్రం వద్ద నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాస్, డిపిఒ మల్లిఖార్జునరావు, ఎంపిడిఒ గంటా వెంకటరావు, తహసీల్దార్ కూర్మనాథ్, గ్రామ సర్పంచ్ ఆది లక్ష్మి పాల్గొన్నారు.

తల్లి పాల వారోత్సవాలు పోస్టర్ ఆవిష్కరణ

ఐసిడిఎస్ ఆధ్వర్యాన కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చేతుల మీదుగా తల్లి పాల వారోత్సవాలు పోస్టర్‌ను ఆవిష్కరించారు. భారతదేశ తల్లిపాల సంస్కృతి ప్రోత్సాహక నెట్ వర్క్) వారు స్థిరమైన మద్దతు ఇచ్చే వ్యవస్థలను ఏర్పరిచి.. తల్లిపాల సంస్కృతి ప్రోత్సాహానికి ప్రాధాన్యత ఇద్దాం' అనే అంశాన్ని ఈ ఏడాది 2025 తల్లిపాల వారోత్సవాల సందేశంగా ప్రకటించారని తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఆర్‌జెడి జి.చిన్మయి దేవి, ఐసిడిఎస్ పీడీ టి.విమలా రాణి, సిడిపిఒలు జి.ప్రసన్న, ఎస్.ఆరుద్ర, ఉమాభారతి పాల్గొన్నారు.

రాస్తారోకో చేస్తున్న పిపిఎస్ఎస్, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక నాయకులు, ప్రజలు

చారిత్రక కట్టడాలను రక్షించుకుందాం

పట్టణ పౌర సంక్షేమ సంఘం పిలుపు ● సింహాచలం మేడ వద్ద రాస్తారోకో

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం చారిత్రక వారసత్వ సంపద రోజురోజుకీ కనుమరుగవుతోందని, వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం నగరంలోని సింహాచలం మేడ వద్ద పిపిఎస్ఎస్ ఆధ్వర్యాన రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో చరిత్ర కలిగిన సింహాచలం మేడను కూల్చేశారని, పాత మహారాజా ఆసుపత్రి వద్ద ఉన్న రైతు బజారును అశోక్ గజపతిరాజు చీకటి జిఒ 124 ద్వారా కబ్జా చేశారని తెలిపారు. బొంకులదిబ్బను ఇప్పటికే ౦౦౦౦౦౦౦అద్దెలకు ఇచ్చేస్తున్నారని చెప్పారు. దేవస్థానం ఆస్తి అయిన సింహాచలం మేడను ఎటువంటి నిర్ణయమూ ప్రజలకు చెప్పకుండా కూల్చేసి ఏమి చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక జిల్లా కన్వీనర్ ఎం.శ్రీనివాస మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం చారిత్రక సంపద అమ్ముకోవడం దౌర్భాగ్యమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చారిత్రక కట్టడాలు రక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి బి.రమణ, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆర్.ఆనంద్, డివైఎఫ్ఐ నాయకులు హరీష్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

అదానీ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అదానీ స్మార్ట్ మీటర్లను ప్రజలంతా వ్యతిరేకించాలని సిపిఐ ఎంఎల్ ఆధ్వర్యాన శుక్రవారం పూల్బాగ్ మంగళవీధి కాలనీలో ప్రచారం చేపట్టారు. స్మార్ట్ మీటర్లు వద్దు-పాత మీటర్లే ముద్దు. ట్రూ అప్ ఛార్జీలతో ప్రజలపై భారం వేయవద్దు. ప్రజలు ఎవరూ స్మార్ట్ మీటర్లు బిగించుకోవద్దని ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ ఎమ్ఎల్ జిల్లా నాయకులు రెడ్డి నారాయణరావు మాట్లాడుతూ కరెంటు బిల్లుల్లో మోపుతున్న ట్రూప్ అప్ చార్జీల భారాలకు స్మార్ట్ మీటర్లు బిగించడానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విజయదుర్గ ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు నీలాపు అప్పలరాజు రెడ్డి, చెన్నా ధర్మా, జి.శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు వెల్ఫేర్ డేను నిర్వహించి, సిబ్బంది నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, పోలీసు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు.

ఎన్ఇపితో ప్రభుత్వ విద్యకు నష్టం : యుటిఎఫ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జాతీయ నూతన విద్యా విధానంతో ప్రభుత్వ విద్యారంగానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని యుటిఎఫ్ సీనియర్ నాయకులు డి.రాము ఆందోళన వ్యక్తంచేశారు. ఎస్‌టిఎఫ్ఐ 9వ జాతీయ మహాసభ కోల్‌కతాలో నిర్వహిస్తున్న సందర్భంగా శుక్రవారం స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఫెడరేషన్ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ ఎన్ఇపి అమలు కారణంగా ప్రభుత్వ విద్యా వ్యవస్థ కుదించుకు పోతోందన్నారు. విచ్చలవిడిగా ప్రయివేటు విద్యాసంస్థలు పెరగడానికి కారణం అవుతుందని తెలిపారు. దీని మూలంగా పేదల పిల్లలకు నాణ్యమైన విద్య అందే అవకాశం లేదన్నారు. అందరికీ సమానమైన విద్య అందించాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల మూలంగా ఏకోపాధ్యాయ పాఠశాలలు విపరీతంగా పెరిగాయని చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం ప్రభుత్వ ప్రాధాన్యతలో లేకుండా, బోధనేతర కార్యక్రమాలపైనే దృష్టి సారించడంతో సరైన విద్య అందడం లేదన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు సిహెచ్ తిరుపతినాయుడు, ఎం.సత్యనారాయణ, జిల్లా అకడమిక్ కమిటీ కన్వీనర్ జి.గంగాధర్ రావు, నగర ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

జెండావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న యుటిఎఫ్ నాయకులు

బొబ్బిలి : ఎస్‌టిఎఫ్ఐ రజతోత్సవాల సందర్భంగా యుటిఎఫ్ జెండాను రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్ఇపి అమల్లోకి వచ్చాక ప్రాథమిక విద్యారంగం నుండి ఉన్నత విద్య రంగం వరకు చేపట్టిన సంస్కరణలు నష్టదాయకంగా మారాయని తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్, జిల్లా కార్యదర్శి కేశవరావు, నాయకులు శంకరరావు, రమేష్, శ్రీనివాస్, సుధాకర్, రామారావు, కృష్ణదాసు, స్వామి నాయుడు, త్రినాథ్, వెంకటరావు పాల్గొన్నారు.

రెడ్డివానివలసలో పాఠశాల భవనం నిర్మించాలని వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మెంటాడ మండలం రెడ్డివానివలస గిరిజన గ్రామంలో విద్యార్థులకు చదువుకునేందుకు పాఠశాల భవనం లేదని, పూర్తికాని ఒక ఇంట్లో పాఠశాల నిర్వహిస్తున్నందున భవనం మంజూరు చేయాలని కోరుతూ కలెక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు యుటిఎఫ్ నాయకులు కె.విజయగౌరి, జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు వినతి అందజేశారు. పాఠశాలలో 28మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారని, పాఠశాల భవనం శిథిలమై 20 సంవత్సరాలు అయినప్పటికీ శాశ్వత భవనం నిర్మాణం జరగలేదని తెలిపారు. విద్యార్థులకు కావలసిన మౌలిక వసతులు కల్పించాలని, అసంపూర్ణంగా ఉన్న భవనాన్ని పూర్తి చేయాలని కలెక్టర్‌ను కోరారు.

ఖాకీ కల.. సాకారమైంది వేళ

జిల్లా యువతకు పోలీసు కొలువులు
గ్రామాల్లో సందడి

రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన కానిస్టేబుల్ పరీక్ష ఫలితాల్లో జిల్లా యువత సత్తా చాటారు. ఖాకీ యూనిఫాంను కలను నెరవేర్చుకున్నారు. ఎంపికైన వారిలో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారే అధికంగా ఉండటం విశేషం. కానిస్టేబుల్ ఉద్యోగ సాధనే లక్ష్యంగా కొన్నేళ్లుగా వారి కఠోర శ్రమకు ఫలితం దక్కిందని కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఆయా గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పోలీసు ఉద్యోగం రూపంలో ప్రజలకు సేవలందించే అవకాశం లభించడం పట్ల విజేతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

\- ప్రజాశక్తి, విలేకర్ల యంత్రాంగం

వదిన, మరిదికి కొలువులు

పూసపాటిరేగ : కానిస్టేబుల్ ఫలితాల్లో మండలంలోని కనిమెట్ట పంచాయతీ పరిధిలోని గుండపురెడ్డి పాలెం గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన వదిన, మరిది ఇద్దరూ కానిస్టేబుల్ పోస్టులకు ఎంపిక కావడంతో గ్రామంలో ఆనంద వాతావరణం నెలకొంది. యువతకు స్ఫూర్తినిచ్చే ఈ విజయగాథలో కూనిశెట్టి హరి, కూనిశెట్టి ప్రమీల ఇద్దరూ శ్రీకాకుళం జిల్లాలో సివిల్ కానిస్టేబుళ్లుగా ఎంపిక య్యారు. హరి 5 ఏళ్ల వయసులో తండ్రి దుర్గారావుని కోల్పోయారు. తల్లి అన్నపూర్ణమ్మ కూలి పనులు చేస్తూ తనను చదివించింది. 2023లో బిటెక్ ఫైనల్ ఇయర్ చదువుతుండగానే ఎస్ఎస్‌సి ద్వారా ఎస్ఎస్‌బి కానిస్టేబుల్‌గా, 2024లో సిఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా ఎంపికైనప్పటికీ సివిల్ పోలీస్ సాధించాలనే ఉద్దేశంతో ఆ జాబ్‌లకు వెళ్ళలేదు. పట్టుదలతో చదివి తాజాగా సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు. అన్నయ్య భార్య వదిన ప్రమీల కూడా శరీర దారుఢ్య పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా శిక్షణ పొంది, తల్లి, గృహిణిగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే పోలీస్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. ఆమె 2024లో అమరావతి జిల్లా కోర్టులో జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికైనా, దూరం కావడంతో ఆ జాబ్‌కి వెళ్ళలేదు. ఇప్పుడు పోలీసు కానిస్టేబుల్‌గా ఎంపికై స్ఫూర్తిగా నిలిచింది.

కూనిశెట్టి ప్రమీల

కూనిశెట్టి హరి

శ్రమించారు..సాధించారు

మెంటాడ : కానిస్టేబుల్ పరీక్ష ఫలితాల్లో మండలంలోని యువకులు సత్తా చాటారు. కొంపంగి, జక్కువలో ఐదుగురు చొప్పున ఎంపికయ్యారు. కొంపంగిలో దేవరపల్లి లోకేష్, చందక లోకేష్, నెలివాడ రాజేష్,దాడి వాసుదేవరావు, దాడి వెంకటరమణ, జక్కువలో కెల్ల భాస్కరరావు, మాతల మణికంఠ, ఒనుము పైడిరాజు, రొంగలి ఈశ్వరరావు ఎంపికయ్యారు. వివిధ గ్రామాలకు చెందిన మరో పదిమంది కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారంతా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారే. కానిస్టేబుల్‌గా ఎంపికైన వారిని స్నేహితులు, స్థానికులు అభినందించారు.

ఆ కుటుంబంలో ఆనందం రెండింతలు

గుర్ల : మండలంలోని శేషపుపేట గ్రామానికి చెందిన అన్నదమ్ములు కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికయ్యారు. సువ్వాడ రాంబాబు, రమణ అన్నదమ్ములు. వీరు ఎపిఎస్‌పి కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరి తల్లిదండ్రులు పాపారావు, భానుకుమారి వ్యవసాయ కూలీలు. కుమారులిద్దరికీ ఒకేసారి ఉద్యోగాలు రావడంతో వీరి ఆనందానికి అవధుల్లేవు.

సువ్వాడ రాంబాబు, రమణ

ఒకే ఊరు.. ఒకే గది

పాతబగ్గాంలో ఐదుగురికి పోలీసు కొలువులు

కుమిలి ధనంజయ

టి.పవన్ కళ్యాణ్

గజపతినగరం రూరల్ : పోలీస్ ఉద్యోగమే ఊపిరిగా భావించి కలలుకని సాకారం చేసుకున్నారు.. గజపతినగరం మండలం పాతబగ్గాం గ్రామానికి చెందిన ఐదుగురు యువకులు. నియోజక వర్గంలోనే ఈ గ్రామానికి గుర్తింపు తెచ్చారు. పాతబగ్గాం గ్రామానికి చెందిన తగరంపూడి పవన్ కళ్యాణ్, కుమిలి ధనంజయ సివిల్ కానిస్టేబుల్, సంగంరెడ్డి హేమంత్ కుమార్, సంగంరెడ్డి గణేష్, కడమల దినేష్‌కుమార్ ఎపిఎస్‌పి కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరంతా ఒకే గదిలో చదువుకుంటూ ఉద్యోగాలు సాధించడం గమనార్హం. పోలీస్‌శాఖతో ఆ గ్రామానికి ప్రత్యేక అనుబంధం ఉంది. 2009లో ఇద్దరు, 2011లో ఒకరు, 2014లో ముగ్గురు, 2018లో ఒకరు, 2022లో సబ్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగాలు సాధించగా, శుక్రవారం విడుదలైన కానిస్టేబుల్ ఫలితాలలో ఏకంగా ఐదుగురు కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. వీరిని గ్రామస్తులంతా అభినందించారు.

సంగంరెడ్డి హేమంత్



కడమల దినేష్‌కుమార్

సంగంరెడ్డి గణేష్

ఒకే పంచాయతీలో 8 మంది ఎంపిక

నెల్లిమర్ల: మండలంలోని సీతారామునిపేట పంచాయతీ పరిధిలోని సీతారామునిపేట, జగ్గరాజుపేట గ్రామాలకు చెందిన ఎనిమిది మంది యువకులు పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపిక కావడంతో ఆయా గ్రామాల్లో సంబరాలు చేసుకుంటున్నారు. సీతారామునిపేటకు చెందిన అక్కడ రాకేష్, కళ్యాణం రమణ, దన్నాన సాయికుమార్, లెంక వెంకటేష్, జగ్గరాజుపేటకు చెందిన కళ్యాణం జగదీష్, కళ్యాణం నారాయణరావు, పంచాది సాయి, కంది శ్రీను, కళ్యాణం నారాయణరావు ఎంపికయ్యారు. జరజాపు పేటకు చెందిన కనకల సాయి ఎపిఎస్‌పికి ఎంపికయ్యాడు.

అప్పలనాయుడుకు రెండో ర్యాంకు

వంగర: కానిస్టేబుల్ ఫలితాల్లో మండలంలోని తలగాం గ్రామానికి చెందిన పి.అప్పలనాయుడు 167 మార్కులతో రాష్ట్ర స్థాయిలో రెండు, జిల్లాలో మొదటి ర్యాంకు సాధించాడు. సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. మండలంలోని అరసాడకు చెందిన కోరాడ తరుణ్, ఉప్పు నవీన్, ఉప్పు గంగులు ఎపిఎస్‌పికు ఎంపికయ్యారు. వంగరకు చెందిన అరటి కట్ల సంతోష్ కుమార్, బూరి రాంబాబు, బెవర వెంకటేష్ కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. మగ్గూరుకు చెందిన వేగిరెడ్డి రామారావు, శ్రీహరిపురానికి చెందిన గార సాయికుమార్, మానాపురం దుర్గా శెట్టి, బుగత రాంబాబు, కొనంగిపాడుకు చెందిన పిన్నింటి మణికంఠ, చందక అప్పలనాయుడు వివిధ కేటగిరీల్లో కానిస్టేబుళ్లగా ఎంపికయ్యారు.

పి.అప్పలనాయుడు

అంట్లవారలో ఐదుగురికి కొలువులు

ప్రజాశక్తి-తెర్లాం

మండలంలోని అంట్లవార గ్రామానికి పోలీసు ఉద్యోగాల్లో పంట పండింది. ఆ గ్రామానికి చెందిన నలుగురు యువకులు, ఒక యువతి కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించి సత్తా చాటారు. గంట నాగమణి, ఎస్.రవీంద్ర, కె.కళ్యాణ్‌కుమార్ సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగాలు, గంట మధు, ఎస్.హరికృష్ణ ఎపిఎస్‌పి కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించడంతో గ్రామంలో సంబరాలు చేసుకున్నారు.

పేద కుటుంబాల్లో..

బూరిపేటకు చెందిన బూరి భాస్కరరావు, వంజరాపు తిరుపతిరావు కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించారు. పేద కుటుంబాలకు చెందిన వారిద్దరు కష్టపడి ఉద్యోగాలు సాధించడంతో గ్రామస్తులు అభినందించారు.

బూరి భాస్కరరావు

వి.తిరుపతిరావు

టిడిపి మండల అధ్యక్షులుగా కర్రోతు

ప్రజాశక్తి- డెంకాడ(భోగాపురం)

భోగాపురం మండల టిడిపి అధ్యక్షులుగా కర్రోతు సత్యనారాయణ మరోసారి ఎన్నికయ్యారు. భోగాపురం పార్టీ కార్యాలయంలో ఎపి మార్కెఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు ఆధ్వర్యంలో శుక్రవారం పార్టీ కమిటీలను నియమించారు. మండలంలోని అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తల అభిప్రాయం మేరకు మండలం పార్టీ అధ్యక్షులుగా కర్రోతు సత్యనారాయణని కొనసాగిస్తున్నామని వెల్లడించారు. పార్టీ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కష్టపడాలని పార్టీ ప్రతి ఒక్కరిని రానున్న రోజుల్లో గుర్తిస్తుందని అన్నారు. అనంతరం ముక్కాం గ్రామానికి చెందిన చల్లపల్లి అప్పన్న అనే బూత్ కన్వీనర్‌ను రూ.5వేలు నగదు బహుమతితో పాటు సత్కరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు ఎండి నజీర్, మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, క్లస్టర్ ఇంచార్జ్ దాసరి అప్పలస్వామి, భోగాపురం సీనియర్ నాయకులు నీలాపు అప్పల రామిరెడ్డి, కోరాడ తాతారావు, సిరపు శ్రీను, పిడుగు వెంకట సత్యం, గరి వెంకటరమణ, కోల రామసూరి తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి టౌన్ ఎస్ఐగా ప్రకాశ్

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి పట్టణ ఎస్ఐగా ఎన్.వి.ఎస్ ప్రకాశ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం ఎస్‌పి కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ప్రకాశ్ బదిలీపై పట్టణ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు. ట్రాఫిక్ సమస్య, శాంతి భద్రతల పరిరక్షణకు పని చేస్తానని ఆయన చెప్పారు.

జెండర్ వివక్షపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జెండర్ వివక్షపై అవగాహన కల్పించాలని ఇంచార్జి ఎంపిడిఒ సుదర్శనరావు సూచించారు. శుక్రవారం ఆయన స్థానిక జెండర్ రిసోర్స్ సెంటర్‌ని సందర్శించి మాట్లాడుతూ జెండర్ వివక్షపై గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని తెలిపారు. లింగ వివక్షత, బాల్యవివాహాలు జరగకుండా చూడాలన్నారు. కాగా సచివాలయం మహిళా పోలీస్‌లతో సమావేశం నిర్వహించి జెండర్‌పై అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం ఎస్‌విడి సురేష్, సిఆర్‌పి కనక మహాలక్ష్మి, సిసిలు అప్పలనాయుడు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రైతులకు శిక్షణ

ప్రజాశక్తి- డెంకాడ

మేలైన యాజమాన్య పద్ధతులపై సింగవరం, పినతాడివాడ రైతు సేవా కేంద్రాల పరిధిలో గల రైతులకు శుక్రవారం వ్యవసాయాధికారి సంగీత శిక్షణ ఇచ్చారు. పిఎం ఆర్‌కెవివై -2025 పథకంలో భాగంగా రైతులకు శిక్షణ ఇస్తున్నామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ బి.భారతి, డాక్టర్ కె.లక్ష్మణరావు, వ్యవసాయ విస్తరణ అధికారి బి.రామకోటి, గ్రామ వ్యవసాయ సహాయకులు రాంబాబు, జయలక్ష్మి, గ్రామ రైతులు పెద్దలు పాల్గొన్నారు.

పుస్తకాలు, పెన్నులు పంపిణీ

ప్రజాశక్తి-గంట్యాడ

మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సహకారంతో గంట్యాడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం స్థానిక నాయకులు నడుపూరి సురేష్, బూడి అప్పలనాయుడు, సుంకరి చక్రి, రఘుమండ శ్రీను పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.

'అన్నదాత సుఖీభవ' అర్హులకు ఇవ్వాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

అన్నదాత సుఖీభవ పథకంలో అర్హులకు ఇవ్వాలని తహశీల్దార్ కె.శ్రీకాంత్ సూచించారు. శనివారం స్థానిక ఎంపిడిఒ సమావేశ మందిరంలో విఆర్ఒ, ఎఇఒ, డిజిటల్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకంలో అర్హత కలిగిన ఏ ఒక్క రైతునూ విడిచి పెట్టకూడదని, ఏమైనా సాంకేతిక సమస్యలుంటే వెంటనే పరిష్కరించి అశ్రద్ధ వహించకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం జాబితా తయారు చేసి అప్లోడ్ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్ఎస్‌డిటి సత్యనారాయణ, విఆర్ఒలు, ఎఇఒలు, డిజిటల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

వైసిపి నాయకుడికి బొత్స పరామర్శ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని కొండగుంపాం గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకుడు, నెల్లిమర్ల జ్యూట్ మిల్ శ్రామిక సంఘం మాజీ అధ్యక్షుడు పతివాడ అప్పారావును మాజీ మంత్రి, శాసన మండలి ప్రతిపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ శుక్రవారం పరామర్శించారు. అప్పారావు గత కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతూ విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొంది ప్రస్తుతం విశాఖలో ఉన్న తన కుమారుడి ఇంటి వద్ద ఉంటున్నారు. విషయం తెలుసుకున్న బొత్స సత్యనారాయణ అప్పారావు ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యం నుంచి వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మరో ఎమ్మెల్సీ డాక్టర్ పివివి సూర్యనారాయణ రాజు, పార్టీ సీనియర్ నాయకుడు అంబల్ల శ్రీరాముల నాయుడు, అప్పారావు కుమారుడు వెంకటేష్, సోదరుడు రమణ పాల్గొన్నారు.

ముళ్ల తుప్పల మధ్య ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ఇది వైద్యాలయమా! పశువుల దొడ్డా?

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్యారోగ్య కేంద్రం పరిసరాలు అపరిశుభ్రతకు నిలయంగా మారాయి. ప్రజలకు వైద్య సేవలు అందించే వైద్యాలయం చుట్టూ ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు, రాళ్లు, చెట్ల నుండి రాలిన ఆకులు పేరుకుపోయి విష కీటకాలు, విశ్వసర్పాలకు నిలయంగా మారింది. వైద్యాలయం లోపల రోగులు విశ్రాంతి గది స్లాబ్‌కు పెచ్చులూడి వర్షానికి కారిపోతుంది. వైద్యాధికారుల సేవలు అందించే గది పనులు పూర్తికాక అసంపూర్తిగా ఉంది. నాడు నేడు నిధులతో గత ప్రభుత్వ చేపట్టిన పనులు పూర్తి కాకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. ఉన్నతాధికారులు స్పందించి వైద్య కోసం వచ్చే రోగులకు తాగునీటి సౌకర్యంతో పాటు వైద్య ఆలయం చుట్టూ ఉన్న ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు, చెత్తను తొలగించాలని రోగులు కోరుతున్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించి అన్ని ప్రాంతాలను అభివద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు అన్నారు. శుక్రవారం 43వ డివిజన్ 52వ నెంబర్ సచివాలయం నుండి ప్రారంభమైన వార్డు పర్యటన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను డివిజన్ కార్పొరేటర్ దాసరి సత్యవతి సహాయ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. వీధి దీపాలు లేదని స్థానికులు చెప్పడంతో వెంటనే వాటి మరమ్మతులను పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్పొరేటర్ దాసరి సత్యవతి మీడియాతో మాట్లాడుతూ తమ డివిజన్లో 20 లక్షల రూపాయలు అభివృద్ధి పనులు నిమిత్తం కేటాయించారని, వాటితో అవసరమైన రహదారులు కాలువలను నిర్మించి సమస్యలు లేని డివిజన్ గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు.

పేదరికమే ప్రామాణికంగా పథకాలు

ప్రజాశక్తి- రేగిడి

పేదవాడే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేయడం సిఎం చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని ఎమ్మెల్యే కొండ్రు మురళీ మోహన్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం మునకలవలసలో పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిని దూబ ధర్మారావు, కిమిడి అశోక్ కుమార్, నారు జనార్ధన రావు, బాల మురళీ, మజ్జి శ్రీనివాసరావు, ధనుంజయ్, కడగల నాగరాజు, శాసపు జనార్దనరావు, రామినాయుడు, నాగభూషణ్, గోవింద్, చల్ల బుజంగరావు, బిల్లాన రమణ, ఎంపిడిఒ డి.నాగమణి, తహశీల్దార్ కృష్ణలత, ఎఒ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మునకలవలస, లక్కవరపుకోటలో పింఛన్లు పంపిణీ చేస్తున్న రాజాం, ఎస్.కోట ఎమ్మెల్యేలు కోండ్ర మురళీ మోహన్, లలితకుమారి

సామాజిక భద్రతే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

లక్కవరపుకోట : పేదల సామాజిక భద్రతే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. శుక్రవారం లక్కవరపుకోటలో కొత్తగా మంజూరు చేసిన వితంతు పింఛన్లను ఆమె లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 158 మందికి కొత్తగా వితంతు పింఛన్లు మంజూరు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో గవర కార్పొరేషన్ డైరెక్టర్ మల్ల రామకృష్ణ, నీటి సంఘం అధ్యక్షులు పుట్టా సుధాకర్, జామి గణేష్, ఎంపిడిఒ ఎస్.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

787 పింఛన్లు మంజూరు

బొబ్బిలిరూరల్ : నియోజకవర్గానికి కొత్తగా 787 వితంతు పింఛన్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే బేబినాయన తెలిపారు. శుక్రవారం మండలంలోని గున్నతోటవలసలో పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి నెలా ఒకటో తేదినే పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి అల్లాడ భాస్కరరావు, మండల అధ్యక్షులు వాసిరెడ్డి సత్యనారాయణ, ఎం.బూర్జవలస సర్పంచ్ సింగనపల్లి ఈశ్వరరావు, ఎంపిడిఒ రవికుమార్ పాల్గొన్నారు.

152 పింఛన్లు మంజూరు

రామభద్రపురం : మండలంలో కొత్తగా 152 వితంతు పింఛన్లు మంజూరైనట్లు ఎంపిడిఒ సిహెచ్ సన్యాసిరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని బూసాయవలస, రామభద్రపురం పంచాయతీల్లో పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. నూతనంగా మంజూరైన పింఛన్లను ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు మడక తిరుపతిరావు, చింతల రామకృష్ణ లబ్ధిదారులకు అందజేశారు.

వేపాడలో 155 పింఛన్లు మంజూరు

వేపాడ : మండలానికి కొత్తగా మంజూరైన 155 వితంతు పింఛన్లను శుక్రవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వాటిని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు పంపిణీ చేసినట్లు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రవికుమార్ తెలిపారు.

పూసపాటిరేగ: మండలంలోని పతివాడలో శుక్రవారం ఎపి మార్కెఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు ఇంటింటికీ తిరిగి పింఛన్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఈ నెలలో స్పౌజ్ కేటగిరీలో కొత్తగా చేరిన 1,09,155 మంది మహిళలకు రూ.4,000 చొప్పున పింఛన్లు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి ఆకిరి ప్రసాద్ రావు, సర్పంచ్ పైడిరాము, టిడిపి నాయకులు పతివాడ వెంకటరమణ, ఆకుల రామునాయుడు, ఆకుల రమణ, నూకరాజు, నమ్మి రమణ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరామర్శల పేరుతో జగన్ డ్రామాలు

డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున

విజయనగరం కోట : పరామర్శల పేరుతో మాజీ సిఎం జగన్ డ్రామాలాడుతున్నారని డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున విమర్శించారు. గాజులరేగలో ఇంటింటికీ వెళ్లి నూతనంగా మంజూరైన వితంతు పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఉనికిని కాపాడుకోవడానికి కూటమి ప్రభుత్వంపై బురద జల్లుతున్నారన్నారు. గత ఐదేళ్లలో ఉత్తరాంధ్రకు వైసిపి ప్రభుత్వం, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ చేసిన అభివృద్ధి ఏమిటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ప్రసాదుల ప్రసాద్, అల్తి బంగారు బాబు, పత్తిగిల్లి సూర్యకుమారి, పత్తిగిల్లి సురేష్, నడిపల్లి రవి కుమార్, గడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం: భోగాపురం గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే లోకం నాగమాధవి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల నాయకులు పాల్గొన్నారు.

గుర్ల: అర్హులైన వారందరికీ పింఛన్లు అందిస్తున్నామని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. శుక్రవారం మండలంలోని పెనుబర్తిలో ఆయన పింఛన్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పింఛను తీసుకుంటున్న భర్త చనిపోతే భార్యకు పింఛన్ ఇచ్చే విధానాన్ని గత ప్రభుత్వం విస్మరించిందని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అటువంటి వారిని కూడా గుర్తించి ఇస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: నియోజకవర్గం వాణిజ్య విభాగం అధ్యక్షులు, ఎంపిటిసి వల్లూరు గణేష్ శుక్రవారం బొద్దూరులో పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం పిఎసిఎస్ చైర్ పర్సన్ చెలికాని మహేష్ బాబు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ చేస్తున్న మార్క్‌ఫెడ్, డిసిసిబి చైర్మన్లు కర్రోతు బంగార్రాజు, కిమిడి నాగార్జున

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల వసతి గృహంలో మిగులు సీట్లు భర్తీ చేయడానికి దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ జయశ్రీ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు ఉన్న మిగులు సీట్లు ఆగస్టు 4న సోమవారం వసతి గృహంలో స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తామన్నారు 5వ తరగతులో 45 సీట్లు, 6వ తరగతిలో 7 సీట్లు, 7వ తరగతిలో 10 సీట్లు, 8వ తరగతిలో 6 సీట్లు, 9వ తరగతిలో 19 సీట్లు, 10వ తరగతిలో 18 సీట్లు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 8 సీట్లు, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 5 సీట్లు ఖాళీలున్నాయన్నారు. వీటన్నింటికి 4న అడ్మిషన్లు చేస్తామన్నారు.

నెల్లిమర్ల: డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఖాళీ సీట్లకు ప్రవేశం పొందాలని ప్రిన్సిపాల్ కె.ఉషారాణి ఒక ప్రకటనలో కోరారు. ఎస్‌సి కేటగిరీలో 5వతరగతిలో 35 సీట్లు, ఇంటర్ ప్రథమ సంవత్సరం సిఇసి ఆంగ్ల మీడియంలో 55 సీట్లు ఖాళీగా ఉన్నాయని వీటికి అర్హులైన వారు ఆధార్, కుల ధృవీకరణ, రేషన్ కార్డు పత్రాలతో ప్రవేశం పొందాలని, ఇతర వివరాలకు ఫోన్ నెంబర్ 9704550016 సంప్రదించాలని కోరారు.

ఒప్పందాలు సరే.. పరిశ్రమలేవి? : కాంగ్రెస్

ప్రజాశక్తి-బొబ్బిలి

రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాల గురించి మంత్రి లోకేష్ చెబుతున్నారు తప్ప ఇప్పటి వరకూ ఒక్క పరిశ్రమ కూడా ఏర్పాటులేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ముద్దల శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు గడిచాయని, ఇప్పటివరకు ఒక పరిశ్రమ కూడా రాలేదని చెప్పారు. రాష్ట్రానికే తలమానికమైన విశాఖ స్టీల్‌ప్లాంట్ ని ప్రయివేటు వ్యక్తుల చేతిలోకి వెళ్లకుండా ఆపి, కాపాడే దిశగా ప్రయత్నాలు చేయాలని డిమాండ్ చేశారు. విశాఖలో ఐటి పరిశ్రమ ఏర్పాటు చేసి మంత్రి చెప్పినట్టుగా ఐదు లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించి, రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించాలని కోరారు.

ఉపాధ్యాయుల నిరసనలు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

రామతీర్థం హైస్కూలులో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఎంఇఒ 1 లుగా ప్రభుత్వ పాఠశాల సహాయకులను నియమించడాన్ని నిరసిస్తూ రామతీర్థం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆపస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ జెడ్‌పి ఉన్నత పాఠశాలల హెచ్ఎంలను, ఎస్ఎలను కాదని ప్రభుత్వ పాఠశాల పాఠశాలల సహాయకులకు ఎంఇఒ 1 పోస్ట్‌లు ఇవ్వడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఉమ్మడి సర్వీస్ నిబంధనల విషయం కోర్టులో ఉండగా ప్రభుత్వం ఒక వర్గానికి అనుకూలంగా వ్యవహరించడం శోచనీయమని అన్నారు. ఈ సమస్యను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని తెలిపారు.

డిప్యూటీ డిఇఒకు వినతి

విజయనగరంటౌన్ : ఎంఇఒలుగా ప్రభుత్వ మేనేజ్మెంట్ స్కూల్ అసిస్టెంట్లను నియమించే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని పిఆర్‌టియు, ఆపస్ నాయకులు డిప్యూటీ డిఇఒకు వినతి అందజేశారు. ప్రభుత్వ పంచాయతీరాజ్ ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీసు రూల్స్‌కు అనుగుణంగా భర్తీచేయాలని ఉపాధ్యాయ సంఘాలు విన్నవిస్తున్నప్పటికీ అధికారులు ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదని అన్నారు. వినతినిచ్చిన వారిలో పిఆర్‌టియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవీంద్ర నాయుడు, డి.శ్రీనివాసరావు, మీడియా ఇంచార్జ్ బంకపల్లి శివప్రసాద్, రామినాయుడు, ఆపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీనివాసరావు,బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని బొద్దాం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. ఎంఇఒ పోస్టులకు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న వారిని నియమించాలని డిమాండ్‌చేశారు.

చీపురుపల్లి: మండల విద్యాశాఖ అధికారి పోస్టు గవర్నమెంట్ హై స్కూల్ అసిస్టెంట్స్‌కి ఇస్తే తాము ఊరుకునేది లేదని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు అన్నారు. మండలంలో గల అన్ని ఉన్నత పాఠశాలల్లోనూ ఉపాధ్యాయులు తమ నిరసన తెలిపారు. కార్యక్రమంలో పిఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు వల్లిరెడ్డి రవీంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కేథలిక్ నన్స్ అక్రమ అరెస్టును ఖండించండి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ రైల్వే స్టేషన్లో గతనెల 25న ఇద్దరు కేథలిక్ నన్స్‌ల అక్రమ అరెస్ట్‌లను ప్రతి ఒక్కరూ ఖండించాలని డిబిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి చిట్టిబాబు, నేషనల్ దళిత క్రిస్టియన్ వాచ్ కన్వీనర్ జాన్ కెనడి కోరారు. శుక్రవారం స్థానిక డిబిఎస్‌యు కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఇద్దరు సన్యాసినులతో పాటు శిక్షణ నిమిత్తం ముగ్గురు వయోజనులైన మహిళలతో పాటు ప్రయాణిస్తుండగా వారిని అరెస్ట్ చేసి వేధించారని, ఇది కొన్ని మతోన్మాద గుంపుల ప్రేరణతో జరిగిన చర్యగా పేర్కొన్నారు. విద్య, ఆరోగ్యం, సామాజిక సేవల్లో కాథలిక్ సన్యాసినుల నిస్వార్థ సేవలను గుర్తించి గౌరవించాల్సిన సమయంలో . మానవ అక్రమ రవాణా చట్టం క్రింద కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించటం అప్రజాస్వామికం అని అన్నారు. సమగ్రమైన దర్యాప్తు జరిపి ఘటనకు సంబంధించి బాధ్యులైన వారిని శిక్షించాలని, అక్రమంగా అరెస్ట్ చేసిన వారిని విడుదల చేయాలని ప్రధానమంత్రి, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. డిబిఎస్‌యు నాయకులు పోతురాజు, టి.చిన్నారావు, ఎంఆర్‌పిఎస్ నాయకులు వై.పోలయ్యపాల్గొన్నారు.

మరణించిన వారి పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలి

ప్రజాశక్తి-రాజాం

మున్సిపాలిటీలో పనిచేస్తూ రిటైర్డు అయిన మరణించిన వారి బిడ్డలకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం మేనేజర్‌కువినతిపత్రం సమర్పించారు .ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు పి శంకర్రావు, యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.జగన్మోహన్‌రావు మాట్లాడుతూ పడాల ప్రసాదు మున్సిపాలిటీల్లో పనిచేస్తూ విధులు నిర్వహిస్తుండగానే మరణించారని, వారి కుటుంబంలో ఉద్యోగం ఇవ్వకుండా స్థానిక మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎక్స్‌గ్రేషియా రెండు లక్షలు కూడా నేటికీ చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రిటైర్ అయిన వారి బిడ్డలకు ఉద్యోగాలు తప్పనిసరిగా ఇస్తామని గతంలో హామీ ఇచ్చారని, కానీ నేడు వాటిని లక్షల్లో అమ్మకానికి పెట్టారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని అన్నారు. తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజల ప్రాణాలకు రక్షణగా నిలబడుతున్న మున్సిపల్ కార్మికులకు ఒక్క పైసా కూడా రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వకుండా ఇంటికి పంపించేసారని, ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వకపోతే వాళ్ళు ఎలా బతకగలరని ప్రశ్నించారు. రిటైర్మెంట్ అయినా మరణించిన వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని, అలాకాకుండా అమ్మకానికి పెడితే ఆందోళనకు సిద్ధం కావాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎం. త్రినాధ్, రాజాం మున్సిపల్ యూనియన్ నాయకులు రాజేష్ , రవి, శ్రీను కనకరాజు దుర్గ చినబాబు లక్ష్మి పాల్గొన్నారు.

కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు, కార్మికులు

కూటమి నాయకులను ప్రశ్నించాలి

మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

హామీలు అమలు చేయకుండా గ్రామాల్లోకి వస్తున్న కూటమి నాయకులను ప్రశ్నించాలని మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రజలను కోరారు. మండలంలోని కొండకరకాం గ్రామంలో శుక్రవారం బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న మోసాలపై కోలగట్ల వివరించారు. సూపర్ సిక్స్ పథకాలతో సహా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఇంకా అమలులోకి ఎందుకు రాలేదని కూటమి నాయకులను ప్రశ్నించే హక్కు ప్రజలకు ఉందని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి మామిడి అప్పలనాయుడు, వైసిపి మండల అధ్యక్షులు కెల్ల త్రినాథ్, నాయకులు మన్మథకుమార్, కొండకరకం సర్పంచ్ కిలారి రాంబాబు, గుంకలాం సర్పంచ్ కునుకు నాగరాజు పాల్గొన్నారు.



టిడిపి మోసాలపై కరపత్రాలు ద్వారా వివరిస్తున్న కోలగట్ల

బ్యాడ్మింటన్ విజేతలకు అభినందన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం డిఎస్ఎ ఇండోర్ స్టేడియంలో కోచ్ జి. శ్రీనివాసరావు వద్ద శిక్షణ పొందుతున్న బ్యాడ్మింటన్ క్రీడాకారులు జులై 23 నుండి 25వ తేదీ వరకు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ వారు నిర్వహించిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్, సెలక్షన్స్ లో సత్తా చాటారు. ఈ సందర్భంగా తమ పిల్లలు సాధించిన ఘనతను దష్టిలో పెట్టుకొని తల్లిదండ్రులు శుక్రవారం స్టేడియంలో అభినందన సభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సీనియర్ ఉపాధ్యక్షులు డాక్టర్ వివిఎస్ ప్రసాద్, ఎం కె బి శ్రీను, వై.కుసుమబ చ్చన్, కార్యదర్శి నున్న సురేష్, విజయనగరం సిటీ షటిల్ బ్యాట్మెంటన్ అసోసియేషన్ కార్యదర్శి కుటుంబరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ పి ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ చాలా ఏళ్ల తర్వాత బ్యాడ్మింటన్‌లో అన్ని విభాగాల్లో విజయం సాధించిన క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో రాణిస్తున్న నవనీత్ తండ్రిని అతిథులు సమక్షంలో ఘనంగా సత్కరించారు.

తల్లిపాల వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తల్లిపాల ప్రాధాన్యతపై ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు అవగాహన కల్పించారు.

గంట్యాడ : తల్లిపాలు ప్రాధాన్యతపై అవగాహన కల్పించడానికి వారోత్సవాలు ప్రారంభించినట్లు ఐసిడిఎస్ పిఒ ఉమాభారతి తెలిపారు. శుక్రవారం మండలంలోని పెదమజ్జిపాలెం, కొర్లాం గ్రామాల్లో అవగాహన ర్యాలీలు చేపట్టారు. ఈ నెల ఏడో తేది వరకు వారోత్సవాలు చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు గాయత్రి, కృష్ణవేణి, పిహెచ్‌సి వైద్యాధికారి పల్లవి, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్ : తల్లిపాల ద్వారానే బిడ్డకు ఆరోగ్యమని ఐసిడిఎస్ పిఒ జె.విజయలక్ష్మి అన్నారు. మండలంలోని కారాడ, కలవరాయి, రంగరాయపురం, గున్నతోటవలస తదితర గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కారాడలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ తల్లి పాలు తాగడం వల్ల బిడ్డకు కలిగే లాభాలను తెలియజేశారు.

అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

అత్యవసర పరిస్థితుల్లో సాధన సభ్యుడు రక్తం దానం చేశారు. శుక్రవారం విజయనగరంలోని కాష్యీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న సిహెచ్ నరసింహరెడ్డికి శస్త్ర చికిత్స నిమిత్తం అరుదైన రక్త వర్గం రెండు యూనిట్లు ఓ నెగిటివ్ అత్యవసరంగా అవసరం కావడంతో పేషెంట్ బంధువులు జరజాపుపేటకు చెందిన సాధన యువజన సంఘం అధ్యక్షులు పోలుబోతు దుర్గా ప్రసాదరావుని సంప్రదించారు. ఈ నేపథ్యంలో దుర్గా ప్రసాద్ వెంటనే స్పందించి, సాధన సభ్యులు కాళ్ళ విజయ్‌కుమార్ (రాయుడు)కు సమాచారం ఇవ్వడంతో రాత్రి 10 గంటల సమయంలో స్థానిక ఇండియా రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేసి పేషెంట్ బందులకు సకాలంలో బ్లడ్ అందడానికి సహకరించారు. దీంతో రక్తదాతకి పేషెంట్ బంధువులు, సాధన యువజన సంఘం, ఇండియన్ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది ముడిగాపు

జాతీయ విద్యా విధానం లోపాలమయం

ఎపిటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు జోగినాయుడు

ప్రజాశక్తి- రామభద్రపురం

లోపాలమయమైన జాతీయ విద్యావిధానాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని ఎపిటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు బంకురు జోగినాయుడు ఆరోపించారు. శుక్రవారం స్థానిక విద్యా వనరుల కేంద్రం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు నాణ్యమైన, సమగ్రమైన, నిరాటంకమైన విద్యను అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని చెప్పారు. ప్రతి ఉన్నత పాఠశాలకు సబ్జెక్టు టీచర్లను ఇవ్వకుండా క్లస్టర్ పాఠశాలల్లోనే సబ్జెక్టు టీచర్లను ఉంచి అక్కడి నుంచి అవసరమైన చోటికి వారిని పంపుతారన్న ప్రతిపాదన వల్ల ఉపాధ్యాయులు రోజువారీ కూలీలుగా మారిపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ విద్యా విధానం పూర్తిస్థాయిలో అమలైతే డిఎస్‌సి ద్వారా ఉపాధ్యాయుల నియామకం ఉండదని చెప్పారు. ఈ నూతన విద్యా విధానాన్ని అందరూ వ్యతిరేకించాలని కోరారు.

విజయనగరం నగరపాలక సంస్థ

పత్రికా ప్రకటన

ఆన్ లైన్ లేఔట్ ప్లాన్ నెం: 1093/0007/LP/VZM/2024

ఇందుమూలంగా యావన్మందికి తెలియచేయునదేమనగా M/s అష్టలక్ష్మి రియల్ ఎస్టేట్స్ కనపాక అయ్యన్నపేట, విజయనగరం నందలి సర్వే సంఖ్య నెం. 156/8p, 18p, 19 to 22, 23p, 24 to 33;157/1 to 9, 11 to 20, 22 to 24, 25p, 26 to 29; 159,160/1, 2, 3p, 4p, 5, 6p, 7p. 8p. 10p, 11p,19p, 20p, & 161/4p, 5p, 6 to 14, 15p, 16p, 25pలో ఎకరములు 11.35 సెంట్లు గల భూమిని లేఔట్ అనుమతి నిమిత్తము దరఖాస్తు చేసుకున్నారు. సదరు దరఖాస్తు ఈ కార్యాలయ ఫైల్ ఆన్ లైన్ నెం : 1093/0007/LP/VZM/2024 నందు పరిశీలన నిమిత్తమైయున్నది.

కావున పైన తెలిపిన లేఔట్ అనుమతి నిమిత్తమై ఎవరికైనను అభ్యంతరములు / సలహాలు కలిగియున్న యెడల ఈ ప్రకటన జారీ చేసిన తేదీ నుండి 7 రోజులలోపు విజయనగరం నగరపాలక సంస్థ కార్యాలయమునకు వ్రాతపూర్వకముగా తెలియజేయవలెను. లేని యెడల ఎట్టి అభ్యంతరములు / సలహాలు లేవని భావించి సదరు దరఖాస్తుపై తదుపరి చర్య తీసుకొనబడునని తెలియజేయడమైనది.

సం/- కమిషనరు, విజయనగరం నగరపాలక సంస్థ